నూలు డిపోలు రాలేదు.. కార్మికులు ఓనర్లు కాలేదు..

- జీడీ కార్మికుల ఆస్పత్రి ఎందుకు కట్టలేదు
- కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఏమైంది
- నేరెళ్ల బాధితులకు పరిహారమేది
- సిరిసిల్లలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



సిరిసిల్లలో సభకు హాజరైన జనసందోహం

సిరిసిల్ల: సిరిసిల్ల నేతకార్మికులు సాంచాలపై కూలీ చేస్తున్నారని, బతుకమ్మ చీరలతో కొంతమంది పెద్ద సేట్లకు మాత్రమే లాభం జరుగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి సిరిసిల్లలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ నుంచి సిరిసిల్ల పట్టణం వరకు పాదయాత్రగా వచ్చారు. సిరిసిల్ల నేతన్నచౌక్‌లో నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'సిరిసిల్లలో సభ అంటే.. కేటీఆర్ భయపడి ఎవరూ రారు అనుకున్నా. కానీ వారి బెదిరింపులకు భయపడకుండా.. ఇంత భారీగా జనం రావడం సంతోషంగా ఉందని' అన్నారు. సిరిసిల్లకు నూలుడిపోలు రాలేదని.. నేత కార్మికులు ఓనర్లు కాలేదన్నారు. పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉండగా.. మంజూరైన బీడీ కార్మికుల ఈఎస్ఐ ఆస్పత్రిని ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీని పూర్తి చేయకుండా.. కమీషన్లను మంత్రి కేటీఆర్ దండుకున్నారని ఆరోపించారు. 9వ ప్యాకేజీ పూర్తి చేస్తే సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలు సస్యశ్యామలం అయ్యేవని.. కానీ కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్‌లు పూర్తి చేసి నీటిని తరలించుకుపోయారన్నారు. నేరెళ్ల దళితులను ఎందుకు ఆదుకోలేదని ప్రశ్నించారు. ఇసుక లారీలకు అడ్డు వస్తున్నారని పోలీసులు కొడితే.. మంత్రి కేటీఆర్ ఆ కుటుంబాలకు ఎందుకు అండగా నిలువలేదని అడిగారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన కె.కె.మహేందర్‌రెడ్డిని పక్కన పెట్టి కేసీఆర్ స్వార్థంతో తన కొడుక్కు సీటు ఇచ్చాడన్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ల్యాండు, సాండు, మైనింగ్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర రావడం లేదన్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నిజాలు తప్ప అబద్ధాలే మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల రాజయ్య, అంజన్‌కుమార్‌యాదవ్, బలరాం నాయక్, పొన్నం ప్రభాకర్, కెకె.మహేందర్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, నాగుల సత్యనారాయణగౌడ్, చీటి ఉమేశ్ రావు, అజ్మతుల్లా హుస్సేన్, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ సందర్శన

సిరిసిల్ల పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌ను సందర్శించి, బాలికలతో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మెనూ అమలుతీరు, వాష్‌రూమ్స్, వసతులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు వడ్డించే భోజనాన్ని రేవంత్‌రెడ్డి పరిశీలించారు. బాలికలతో చాలా సేపు మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణులో జోష్ పెంచింది.

కాంట్రాక్టర్‌పై చర్యలు ఏవి?

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి(సిరిసిల్ల): కమీషన్ల కక్కుర్తితోనే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 9వ ప్యాకేజీ పనుల్లో జాప్యమవుతోందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ శివారులోని కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 9వ ప్యాకేజీ పనులను శనివారం పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. నిర్ణీత కాలంలో పనులు పూర్తిచేయని కాంట్రాక్ట్ సంస్థపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ కమీషన్లు తీసుకున్నందునే సంస్థపై ఒత్తిడి తేలేకపోతున్నారని ఆరోపించారు. పదవులను అడ్డం పెట్టుకొని వేల కోట్ల ఆస్తులు సంపాదించుకున్న కేటీఆర్ 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేయించలేకపోతున్నారని మండిపడ్డారు. 9వ ప్యాకేజీ పనులు పరిశీలించి సిరిసిల్లకు వస్తుండగా తిమ్మాపూర్ సమీపంలో కాన్వాయ్‌లోని వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరు వాహనాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి.

కార్యకర్తలను కాపాడుకుంటా..

పార్టీ కార్యకర్తలను గుండెల్లో పెట్టి కాపాడుకుంటానని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, వెంకటాపూర్ గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల వరకు ప్రజల్లో ఉండాలని కార్యకర్తలకు సూచించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకులు అరాచకం చేస్తున్నారన్నారు. కార్యకర్తలు భయపడకుండా పోరాడాలని కోరారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన నేరెళ్ల బాధితులు

రేవంత్‌రెడ్డిని నేరెళ్ల బాధితులు పెంట బానయ్య, కోల హరీశ్, గంధం శ్రీనివాస్, గోపాల్ కలిశారు. ఈ సందర్భంగా తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ 10 పేజీల వినతిపత్రాన్ని అందించారు. బాధితులతో మాట్లాడిన రేవంత్‌రెడ్డి వారికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

వస్త్రపరిశ్రమ ఆసాములతో సమావేశం

తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో ఏర్పాటు చేసిన క్యాంపులో శనివారం వస్త్రపరిశ్రమకు చెందిన ఆసాములు, కార్మికులతో సమావేశమయ్యారు. వస్త్రపరిశ్రమలో ఎదురవుతున్న ఒడిదొడుకులు, సమస్యలు తెలుసుకున్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ చీరల పేరుతో ఆర్డర్లు ఇచ్చి దినసరి కూలీలుగా మార్చారే తప్ప ఏం మంచి చేశారని ప్రశ్నించారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, మండలాధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్శరాములు, కిషన్‌గౌడ్, వెంకటి, దొమ్మాటి నర్సయ్య, ఎస్.కే.గౌస్, సద్ది లక్ష్మారెడ్డి, పర్శరాములు, సతీశ్, రామచంద్రం, మల్లారెడ్డి, చెరుకు ఎల్లయ్య, అంజిరెడ్డి, తిరుపతిరెడ్డి, మామిండ్ల కిషన్ తదితరులు ఉన్నారు.



బాలికల హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతూ..



కాన్వాయ్‌లో ధ్వంసమైన వాహనాలు



మానేరు వంతెనపై పాదయాత్ర

వృత్తిలో ఆదర్శం.. ప్రవృత్తిలో నైపుణ్యం

ఆదర్శంగా నిలుస్తున్న జిల్లా అధికారులు

సండే స్పెషల్

కరీంనగర్ అర్బన్: వృత్తి, ప్రవృత్తుల సంగమమంటే ఈ అధికారులు గుర్తొస్తారు. ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న వీరిది ఒక్కొక్కరిది ఒక్కో శైలి. విధి నిర్వహణలో ప్రజలకు సేవలందిసూనే.. తమ అభిరుచులకు తగ్గట్టు జీవిస్తున్నారు. ఒత్తిడిని మరిచి ఉల్లాసంగా గడుపుతున్నారు. తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకరు సాహసాలకు చిరునామాగా నిలిస్తే.. మరొకరు పాటల పూదోటలో కోయిలలుగా రాణిస్తున్నారు. ఇంకొకరు వ్యాఖ్యానం చేస్తూ మాటల మాంత్రికుడిగా ముఖ్యులతో అభినందనలు పొందుతున్నారు. మరో అధికారి ఫ్లూట్‌ను వినసొంపుగా వినిపిస్తూ.. ఆకట్టుకుంటుండగా మరొకరు నటనతో రంజింపజేస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలోని పలువురు ద్విపాత్రాభినయ అధికారులపై సండే స్పెషల్..



బంగి జంప్ చేస్తున్న జీవీ.శ్యాంప్రసాద్‌లాల్

సాహసాలకు కేరాఫ్ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్ అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్ లాల్ రచయితలు, కవులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తుంటారు. అదే సమయంలో సాహసాలకూ చిరునామాగా నిలుస్తున్నారు. యువకులతో పోటీ పడుతుంటారు. నిత్యం విధి నిర్వహణలో సమీక్షలు, తనిఖీలతో బీజీగా ఉంటున్నా.. వీలు చిక్కినప్పుడల్లా ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలను సందర్శిస్తుంటారు. ఉత్తరప్రదేశ్‌లో ఓ సారి బంగిజంప్ కూడా చేసి ఔరా అనిపించారు. సాహస క్రీడలైన కనోయింగ్‌తోపాటు అడవుల్లో నిర్వహించే వివిధ అంశాల్లో పాల్గొంటున్నారు.



సంకీర్తనల పూదోట ప్రియాంక



జెడ్పీ సీఈవో సీహెచ్. ప్రియాంక విధినిర్వహణలో బిజీగా ఉంటున్నా.. ఏ మాత్రం విరామం దొరికితే చాలు.. తన స్వరానికి పనిచెబుతుంటారు. కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ సతీమణి అయిన ఈమె ఇటీవలే ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉన్నాయంటే చాలు ఈమె భాగస్వామ్యం తప్పనిసరిగా ఉంటుంది. చిన్నతనం నుంచే సంగీతం నేర్చుకున్న ప్రియాంక.. బ్రహ్మోత్సవాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాటలు పాడుతూ అలరిస్తుంటారు. ఇటీవల కరీంనగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో 'ముద్దుగారే యశోద' అంటూ ఆలపించిన సంకీర్తనతో ఆహూతులను ఆకట్టుకున్నారు.

పాతమధురాల గీతం మంజుల



కరీంనగర్ బాల భవన్ సూపరింటెండెంట్ కట్ట మంజులాదేవి ప్రభుత్వ అధికారిగా కన్నా గాయకురాలిగానే గుర్తింపు పొందారు. ఉమ్మడి జిల్లాలోని అధికారుల్లో మంజులాదేవిది ప్రత్యేకస్థానం. ప్రతి గణతంత్ర, స్వాతంత్ర్య, రాష్ట్ర అవతరణ వేడుక సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగే తేనీటి విందులో ఈమె పాట ఉండాల్సిందే. ఎంత ఒత్తిడిలో ఉన్నా పాటతో మనసు తేలిక అవుతుందంటారు మంజుల. ఈమె రాజన్న సిరిసిల్ల సీపీవో శ్రీనివాసాచారి సతీమణి కావడం గమనార్హం.

కాళి పంచ్ కొడితే పతకమే



కాళిచరణ్



బాక్సింగ్‌లో కాళిచరణ్

జగిత్యాల కలెక్టరేట్ సూపరింటెండెంట్ మడిపల్లి కాళిచరణ్‌గౌడ్‌ది నగరంలోని సిక్‌వాడీ. చిన్నతనంలోనే బాక్సింగ్‌పై అభిరుచి ఎక్కువ. తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నా.. ఇప్పటికీ పంచ్ పైనే ధ్యాస. విశ్వవిద్యాలయం స్థాయిల్లో పలుమార్లు మెడల్స్ సాధించిన ఆయన శాఖాపరమైన క్రీడల్లోనూ పతకాలు అందుకుంటున్నారు. ప్రస్తుతం యువ బాక్సర్లను తయారు చేస్తున్నారు.

ఫ్లూట్ పట్టారంటే సంగీత ప్రవాహమే





ఫ్లూట్‌తో పాట పాడుతున్న శ్రీనివాసరావు

శంకరపట్నం తహసీల్దార్ గూడూరి శ్రీనివాసరావుది చొప్పదండి మండలం కాట్నపల్లి. చదువుకునే రోజుల్లో టీవీల్లో ఫ్లూట్ ఊదుతుండడాన్ని గమనించి ఆసక్తి పెంచుకున్నారు. ఎంసెట్‌కు దరఖాస్తు చేస్తానని ఇంట్లో చెప్పి హైదరాబాద్ వెళ్లి ఫ్లూట్ కొనుక్కున్నారు. వాయిద్యకారుడు కంచర నారాయణ వద్ద ఓనమాలు నేర్చుకుని అప్పటినుంచి ఫ్లూట్ వినిపిస్తున్నారు. ఏ మాత్రం విరామం దొరికినా ఫ్లూట్ పడుతుంటారు. సంగీతాన్ని పాటను మేళవించి ఫ్లూట్‌ను వాయించడం ఇతనికే సొంతం.

ఎత్తు వేస్తే చిత్తవ్వాల్సిందే

చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పీఏగా ఉన్న నాయబ్ తహసీల్దార్ కానిపర్తి మనోహర్‌రావుది కరీంనగర్‌లోని వావిలాలపల్లి. బాల్య దశలోనే చదరంగంపై మక్కువ పెరగడంతో డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేవారు. స్వతహాగా చదరంగంలో మెలకువలు నేర్చుకుంటూనే రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉద్యోగం చేస్తూనే శాఖాపరంగా నిర్వహించే క్రీడలో పాల్గొంటూ ప్రత్యేకంగా నిలుస్తున్నారు. ఆలిండియా, స్టేట్ విభాగాల్లో ప్రథమ స్థానం పొందారు. .



చెస్ ఆడుతున్న కానిపర్తి మనోహర్‌రావు

మాటల మాంత్రికుడు గోపాల్



వ్యాఖ్యానం చేస్తున్న మాడిశెట్టి గోపాల్

ఉమ్మడి జిల్లాలో వ్యాఖ్యానమంటే మాడిశెట్టి గోపాల్ పేరే వినిపిస్తుంది. కరీంనగర్‌కు చెందిన గోపాల్‌ది ఎల్ఐసీలో హయ్యర్‌గ్రేడ్ అసిస్టెంట్ హోదా. అటు విధి నిర్వహణ.. ఇటు ప్రవృత్తిని కొనసాగిస్తూ గుర్తింపు పొందారు. గణతంత్ర, స్వాతంత్ర్య, రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో వినిపించే మాటలు ఇతనివే. అప్పటి ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్.రాజశేఖర రెడ్డి జిల్లా పర్యటనల సమయంలోనూ తన వ్యాఖ్యానం ద్వారా అభినందనలు పొందారు. మలేసియా, సింగపూర్‌లోనూ వ్యాఖ్యానం చేశారు. ఉత్తమ వ్యాఖ్యాతగా అనేక అవార్డులు పొందారు. దీనితోపాటు కవి, రచయిత, నటుడిగానూ రాణిస్తున్నారు.

గళం విప్పితే కరతాళ ధ్వనులే..



పాట పాడుతున్న బాలశ్రీనివాసాచారి

తన గళంతో మంత్రముగ్ధులను చేయడం బాలశ్రీనివాస్‌కే సొంతం. రాజన్న సిరిసిల్ల సీపీవో పెండ్యాల బాలశ్రీనివాసాచారి బాల్యం నుంచే సరిగమలను ఔపోసన పట్టగా వేదిక దొరికిందంటే చాలు పాటలతో మైమరిపింపజేస్తారు. మానకొండూరు మండలం వేగురుపల్లి స్వగ్రామం. కరీంనగర్‌లో స్థిరపడ్డారు. తన తాత కట్ట లక్ష్మినర్సయ్య ఆలిండియా రేడియో ఆర్టిస్ట్. ఆయన వద్ద సంగీతం నేర్చుకున్నారు. చదువుకునే వయసు నుంచి పాటలు పాడేవారు. జానపదం, సినీగీతాలు, పౌరాణిక గాథలను వినసొంపుగా పాడుతుంటారు.

న్యూస్‌రీల్

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత

సిరిసిల్లటౌన్: మహిళల రక్షణకు చట్టాలు కల్పించిందని జిల్లా న్యాయమూర్తి ఎన్.ప్రేమలత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సిరిసిల్లలోని వికాస్ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈవ్‌టీజింగ్ నేరమన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్ నిషేధమన్నారు. సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ, ప్రిన్సిపల్ జడ్జి ఎస్.సాస్వత, అడిషనల్ జూనియర్ జడ్జి లక్ష్మీరాజం, డీడబ్ల్యూవో భాస్కర్, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, ప్రిన్సిపాల్ దిడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుసంక్షేమానికి ప్రాధాన్యత

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మల్లాపూర్‌కు చెందిన ఇల్లెందుల పర్శరాములు ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఈక్రమంలో ఎమ్మెల్యే రవిశంకర్, సెస్ డైరెక్టర్ సుధాకర్‌తో కలిసి మృతుని భార్య పద్మకు రూ.5 లక్షల రైతుబీమా ప్రొసీడింగ్స్, సెస్ ఆధ్వర్యంలో రూ.5లక్షల చెక్కు అందించారు. కొదురుపాకలో 27 మందికి రూ.9.26 లక్షలు, వెంకట్రావుపల్లిలో ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావు, జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, సెస్ ఏఈ రాకేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అన్సారీ



వేములవాడ: వేములవాడ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా సిరిసిల్ల మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ అన్సారీని నియమిస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అన్వేశ్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో అన్సారీని నియమించారు. ఈనెల 6న బాధ్యతలు స్వీకరించనున్నట్లు అన్సారీ తెలిపారు.

నమో.. నారసింహా..



వేదపండితులకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తున్న కలెక్టర్




స్వామివారి కల్యాణ వేడుకలు

- కన్నుల పండువగా నృసింహుని కల్యాణం
- పట్టువస్త్రాలు సమర్పించి కలెక్టర్ యాస్మిన్‌బాషా
- వివిధ రాష్ట్రాల నుంచీ వేలాదిగా తరివచ్చిన భక్తజనం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ వేదపండితులు ప్రత్యేకపూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం కలెక్టర్ యాస్మిన్ బాషా ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. సాయంత్రం శేషప్ప వేదికపై నృసింహుని కల్యాణం కన్నులపండువగా జరిపించారు. వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాల శర్మ మంత్రోచ్చారణలతో ప్రత్యేకపూజలు చేశారు. నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి కల్యాణం తిలకించి తరించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు వేడుకలు వైభవంగా జరిపించారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్ మకరంద, మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కమిషనర్ రమేశ్, డీసీఎమ్మెస్ చైర్మన్, జెడ్పీటీసీ బత్తిని అరుణ, అయ్యోరి రాజేశ్, రెనోవేషన్ కమిటీ సభ్యుడు ఇందారపు రామయ్య, ఎంపీపీ జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

ఆర్ఎంపీ నిర్వాకంపై బల్దియా కొరడా



ఆర్ఎంపీని మందలిస్తున్న కమిషనర్ సమ్మయ్య

సిరిసిల్లటౌన్: స్వచ్ఛ సిరిసిల్లలో ఓ ఆర్ఎంపీ వైద్యుడు బాధ్యత మరిచి బయోవేస్టేజ్‌ను రోడ్డు వెంట పడేయడంపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. స్థానిక కార్గిల్‌లేక్ సమీపంలో శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య వార్డు పరిశీలన చేస్తుండగా రోడ్డు వెంట ప్రమాదకరమైన బయోవేస్టేజ్(మెడికల్ చెత్త) కుప్పలుగా పడేయడాన్ని గమనించారు. నెహ్రూనగర్‌కు చెందిన ఆర్ఎంపీ శ్రీకాంత్ బయోవేస్టేజ్‌ను పడేసినట్లు తెలుసుకుని, వెంటనే పిలిపించి మందలించారు. రూ.15వేలు జరిమానా విధించి మరోసారి పునరావృతం కావద్దని హెచ్చరించారు. టీపీవో అన్సార్, హెల్త్ అసిస్టెంట్ సుకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముస్తాబాద్‌లో చోరీ



చిందరవందరగా వస్తువులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు. ముస్తాబాద్‌కు చెందిన ఉద్యమకారి బుగ్గవ్వ హైదరాబాద్‌లోని కూతురు వద్దకు నెలరోజుల క్రితం వెళ్లింది. బుగ్గవ్వ భర్త సత్తయ్య, కుమారుడు రాజేశ్ దుబాయ్‌లో ఉంటున్నారు. బుగ్గవ్వ ఇంటి తాళం బద్దలు కొట్టి ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఆమెకు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నుంచి వచ్చిన బుగ్గవ్వ ఇంట్లో పరిశీలించగా.. బీరువాలో దాచి ఉంచిన పావుతులం బంగారు ఆభరణాలు, వెండి వస్తువులనె దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. సంఘటన స్థలాన్ని ఎస్సై వెంకటేశ్వర్లు పరిశీలించారు. క్లూస్‌టీం బృందం ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజన్న సేవలో డీఈవో రాధాకిషన్



రాజన్నను దర్శించుకున్న డీఈవో రాధాకిషన్

వేములవాడ: జిల్లా విద్యాధికారిగా విధులు నిర్వహించి మెదక్ డీఈవోగా బదిలీపై వెళ్లిన రాధాకిషన్ శనివారం రాజన్నను దర్శించుకున్నారు. పీఆర్‌టీయూ, ఎస్టీయూ, బీసీటీఏ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. ఎడ్ల కిషన్, మొగిలి లక్ష్మణ్, పులి రాంగోపాల్, వి.లక్ష్మీనారాయణ, కిరణ్‌రావు, పెరుమాండ్ల శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



మహిళా దినోత్సవంలో చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, మహిళ కౌన్సిలర్లు పోచవేని సత్య, దార్నం అరుణ, నేరెళ్ల శైలు, ఆకునూరి విజయ నిర్మల, ఆడెపు సౌజన్య, దార్ల కీర్తన, సమాఖ్య సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

అధికారిని నియమించాలి

సిరిసిల్లటౌన్: జిల్లాకు షెడ్యూల్ట్ కులాల అధికారిని నియమించాలని కులవివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతిపత్రాన్ని అందించారు. హాస్టల్స్‌లో మెనూ ప్రకారం భోజనం అమలు కావడం లేదన్నారు. ప్రవీణ్, పాల్గొన్నారు.

బస్టాండులో దాహం.. దాహం..

- ప్లాట్‌ఫామ్‌లపై ఎండలో నిరీక్షణ
- వాటర్ బాటిళ్లకు అధిక వసూళ్లు
- మొదలైన వేసవి కష్టాలు



బస్సుల కోసం ఎండలో పడిగాపులు కాస్తున్న ఈ ఫొటో ఎక్కడో మారుమూల పల్లె అనుకుంటే మీరు పొరపడినట్లే. జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో నిత్యం కనిపించే చిత్రాలివి. ఈ బస్టాండ్ నుంచి వందలాది మంది ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. కనీసం చలువ పందిళ్లు కూడా వేయకపోవడంతో అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.



సిరిసిల్ల పాత బస్టాండ్



తాళం వేసిన ఈ వాటర్ ప్లాంట్‌ను మంత్రి కేటీఆర్ ఆరేళ్ల క్రితం రూ.3 లక్షలతో రాష్ట్రంలోనే మొదట సిరిసిల్ల పాత బస్టాండ్‌లో చల్లని నీటి ఉచిత ప్లాంట్ ఏర్పాటు చేయించినా, అధికారుల నిర్లక్ష్యంతో మూతబడింది. కాగా ప్రయాణికులు గొంతు తడుపుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

సిరిసిల్ల టౌన్: సుదూర ప్రాంతాల నుంచి సిరిసిల్లకు వచ్చే ప్రయాణికులకు గుక్కెడు తాగునీరందించాలన్న పట్టింపు అటు ఆర్టీసీ, ఇటు మున్సిపల్ అధికారులు, పాలకులకు లేదు. 22 ఏళ్ల క్రితం పాత బస్టాండ్‌లో మున్సిపల్ ఆధ్వర్యంలో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించారు. రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికులతో సిరిసిల్ల ఆర్టీసీ డిపో కూడా వృద్ధి చెందింది. ప్రతినెలా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా, ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పించడంలో శ్రద్ధ చూపడం లేదు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై మంత్రి కేటీఆర్ స్పందించడంతో శుద్ధజల కేంద్రం ఏర్పాటు చేయించినా, దాని నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో ప్రయాణికులు వాటర్ బాటిళ్లు కొనుక్కొని దాహం తీర్చుకుంటున్నారు. ప్లాట్‌ఫాం వద్ద నీడ కల్పించకపోవడంతో మండుటెండల్లో అవస్థలు పడుతున్నారు.

ప్రయాణికుల ప్రయాసలివి..

- జిల్లా కేంద్రమైన సిరిసిల్లకు 13 మండలాలతో పాటు, హైదరాబాద్, ముంబై భీవండి, షోలాపూర్, గుజరాత్, వరంగల్‌తో పాటు పలుప్రాంతాల నుంచి రోజూ వేలాది మంది ప్రయాణికులు, సందర్శకులు వస్తుంటారు.
- ఇక్కడ ఏర్పాటు చేసిన చల్లని శుద్ధజల కేంద్రాన్ని పూర్తిగా మూసివేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేమితో వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది.
- కొందరు వ్యాపారులు అధికరేట్లకు నాణ్యత లేని వాటర్‌బాటిళ్లకు ప్రయాణికులకు అంటగడుతున్నారు. దీంతో పలువురు రోగాలబారిన పడుతున్న పరిస్థితి నెలకొంది.
- వివిధ రూట్లలో ప్రయాణించే ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌పై మండుటెండల్లో నిరీక్షించాల్సి వస్తోంది. గతంలో గ్రీన్‌నెట్స్ ఏర్పాటు చేయగా, ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.
- ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాల్సి ఉండగా, అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

తాగునీటి సౌకర్యం లేదు



అసలే వేసవి కావడంతో బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం కల్పించడం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు శుద్ధజలం కేంద్రాన్ని రిపేర్ చేయించి వినియోగంలోకి తీసుకురావాలి.

– గంధం హరీశ్, చీర్లవంచ, ప్రయాణికుడు

కొనుక్కొని తాగుతున్నాం.



ప్రయాణికుల అవస్థలు పట్టించుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలి. బస్టాండ్‌లో వాటర్ బాటిళ్లు కొనుక్కొని తాగాల్సిన దుస్థితి నెలకొంది. మండుటెండల్లో ప్రయాణికులకు నీడ కల్పించేలా గ్రీన్‌నెట్స్ తోపాటు దాహం తాగునీటిని ఏర్పాటు చేయాలి.

–చిదుర నరేశ్, సిరిసిల్ల

పోలీసుల ఫైరింగ్ ప్రాక్టీస్

సిరిసిల్లక్రైం: వార్షిక శిక్షణలో భాగంగా బెటాలియన్‌లో జిల్లా పోలీసులు శనివారం ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. ఫైరింగ్ ప్రాక్టీస్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవడంతోపాటు అన్ని రకాల ఆయుధ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. అల్లర్లు జరిగినప్పుడు అల్లరి మూకలను చెదరగొట్టేందుకు వజ్ర వెహికల్‌ని ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఏఎస్పీ చంద్రయ్య, ఆర్‌ఐలు కుమారస్వామి, రజనీకాంత్, యాదగిరి, సీఐ అనిల్‌కుమార్ తదితరులు





రాధాకిషన్ పేరు చిరస్థాయిలో నిలుస్తుంది

- జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ్
- బదిలీపై వెళ్తున్న డీఈవోకు సన్మానం

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : జిల్లా ఏర్పాటు అనంతరం మొదటి డీఈవోగా పనిచేసిన రాధాకిషన్ పేరు చిరస్థాయిలో నిలుస్తుందని జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. శనివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో నిర్వహించారు. వివిధ ప్రతిభా పోటీల్లో విద్యార్థుల రాణించేందుకు కృషిచేస్తూ జిల్లా పేరును జాతీయస్థాయిలో నిలిపారన్నారు. అధికారిగా ఉపాధ్యాయులను సమన్వయం చేసిన తీరు బాగుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్ కుమార్, వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, ఐక్యవేదిక అధ్యక్షులు లకావత్ మోతీలాల్, మార్వాడి గంగరాజు, వికతి లక్ష్మీనారాయణ, వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు



సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కుట్టు మిషన్‌ల పంపిణీ



మిషన్‌లను పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలోని రియల్ ఇండియా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. సెస్‌డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

శివసత్రానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

వేములవాడ: వేములవాడ శివస్వాముల అన్నదాన సత్రానికి పట్టణానికి వెంగళ శ్రీకాంత్‌గౌడ్–నీతు దంపతులు రూ.50 వేల విరాళం శనివారం అందజేశారు. సత్రం గౌరవాధ్యక్షుడు మచ్చ కిషన్, కార్యదర్శి సామవీర రమణయ్య, కోశాధికారి రాపెల్లి శ్రీధర్, సత్రం ఇన్‌చార్జి గుంటి కనకయ్య, బండ చందు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అర్హులైన నిరుద్యోగులకు గ్రూప్ 2, 3, 4 ఉద్యోగాలకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మైనార్టీలు తమ దరఖాస్తులను ఈనెల 10లోపు కలెక్టరేట్‌లోని 26 నంబర్‌లోని మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

మంత్రి కేటీఆర్ అండదండలతోనే అక్రమాలు

- కాంగ్రెస్ నాయకులు ఆది శ్రీనివాస్, కె.కె.మహేందర్‌రెడ్డి



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి శనివారం పద్మనగర్‌లోని కాంగ్రెస్ క్యాంపులో మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్, బీజేపీలపై డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌తో కలిసి చార్జిషీట్ విడుదల చేశారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ అండతో అనుచరులు అక్రమంగా ఇసుక, మొరం దందాలు చేస్తున్నారన్నారు. ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కమీషన్లు ఇవ్వకుంటే బతుకమ్మ చీరల పథకం కింద నేతన్నలకు వర్క్ ఆర్డర్లు ఇవ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు డబుల్ బెడ్‌రూమ్ కేటాయింపునకు లబ్ధిదారుల నుంచి రూ.లక్ష కమీషన్‌గా తీసుకుంటున్నారని ఆరోపించారు. ప్రతీ మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి ఏదని ప్రశ్నించారు. జిల్లా ఆసుపత్రిలో మందులను మాయంచేసి ప్రైవేటు ఫార్మసీలకు అమ్ముతున్నారని ఆరోపించారు. సెస్‌లో అవినీతి అక్రమాలను అరికట్టడంలో విఫలమయ్యారని విమర్శించారు. మంత్రి అండ చూసుకుని అమాయక విద్యార్థినుల పట్ల కీచకపర్వం కొనసాగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రిని చూసుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త రూ.కోట్ల విలువ చేసే భూములు ఆక్రమించారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు తోడు దొంగలన్నారు. బీఆర్ఎస్‌ను బందిపోట్ల రాక్షస సమితి, బీజేపీని భ్రష్ట జుమ్లా పార్టీగా అభివర్ణించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్(టోని), నాయకులు పాల్గొన్నారు.

మాది రైతు సంక్షేమ ప్రభుత్వం

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): మాది రైతు సంక్షేమ ప్రభుత్వమని, సీఎం కేసీఆర్ అహర్నిశలు రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. గంభీరావుపేటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 9వ ప్యాకేజీ పనుల సందర్శన సమయంలో టీపీసీసీ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్రంలో ఎవరు కమీషన్లు వసూలు చేస్తున్నారో, బెదిరింపులకు పాల్పడుతున్నారో సామాన్యులకు తెలుసునన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కేటీఆర్ కృషి చేస్తున్నారన్నారు. మండు వేసవిలోనూ నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టును నిండుకుండలా ఉంచిన ఘనత కేటీఆర్‌దేనని స్పష్టం చేశారు. భూగర్భజలాలు పెరిగి టన్నెల్ పనుల్లో జాప్యంతోనే 9వ ప్యాకేజీ పనుల్లో ఆలస్యమవుతోందన్నారు. సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణశాఖ అధ్యక్షుడు వెంకటియాదవ్ పాల్గొన్నారు.

అన్ని రంగాల వారికి సహకారం



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): అన్ని రంగాల వారికి సహకార సేవలందిస్తున్నామని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. గంభీరావుపేట సింగిల్‌విండో మహాజన సభ శనివారం నిర్వహించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార బ్యాంకులు వాణిజ్య బ్యాంకులకు దీటుగా పనిచేస్తున్నాయన్నారు. ఇటీవల ఆన్‌లైన్, యాప్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల చదువులకు, ఇళ్ల నిర్మాణాలకు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్నిరకాల సేవలందిస్తున్నామన్నారు. సీఈవో రాజిరెడ్డి, మేనేజర్ సత్యంరావు, వైస్‌చైర్మన్ రామానుజాగౌడ్, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధ్యయనం

- జిల్లాలో శిక్షణ సివిల్ సర్వీసెస్ అధికారులు
- అభివృద్ధి, జీవనశైలి పరిశీలన



రాజన్నపేట గ్రామస్తులతో మట్లాడుతున్న శిక్షణ అధికారులు

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/వేములవాడరూరల్: రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వివిధ గ్రామాల్లో శిక్షణ ఇండియన్ సివిల్ సర్వీసెస్ అధికారులు శనివారం పర్యటించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుతీరును పరిశీలించనున్నారు. మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేటలో శిక్షణ అధికారులకు అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్ వివరిస్తున్నారు. ఇండియన్ ఎకానామికల్ సర్వీసెస్(ఐఈసీ), ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీసెస్(ఐఎస్ఎస్)అధికారులు అర్జున్‌గుప్తా, అంచల్‌జైన్, పంకజ్ మీనా, హర్షిత్ అగర్వాల్, అంకిత్ మోండల్ వచ్చారు. ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ జయంత్‌కుమార్, సర్పంచ్ ముక్క శంకర్, ఎంపీవో వజీర్, కార్యదర్శులు .

బస్వాపూర్‌లో..

తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌లో ఇండియన్ సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు కుమారి చిత్వాన్, శాగున్‌సింగ్, ప్రీతి తివారి, అమిత్ సాహా, మనోజ్‌కుమార్‌మీనాలు పర్యటించారు. వీరికి ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ గొడిసెల నీరజ స్వాగతం పలికారు. ఎంపీడీవో పి.లచ్చాలు, జేపీఎస్‌లు జనార్దన్, సలీం, వాణి, మౌనిక పాల్గొన్నారు.

మత్రిపల్లిలో..

వేములవాడ మండలంలోని మత్రిపల్లికి ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీసెస్ అధికారులు వారం రోజుల పర్యటనకు వచ్చారు. వీరికి వేములవాడ ఎంపీడీవో రాంరెడ్డి, సర్పంచ్ కట్కం మల్లేశం స్వాగతం పలికారు.

10 నుంచి క్రీడాపోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న నాగుల శ్రీనివాస్

సిరిసిల్లఅర్బన్ : సిరిసిల్ల పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ క్రీడోత్సవాల్లోభాగంగా ఖేలో సిరిసిల్ల–జీతో సిరిసిల్ల క్రీడా పోటీలను ఈ నెల 10 నుంచి ప్రారంభిస్తున్నట్లు బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ తెలిపారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ బండి సంజయ్ పర్యవేక్షణలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పలు పోటీలు నిర్వహిస్తున్నట్లుపేర్కొన్నారు. ఈనెల7లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు పోటీలకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9503501011, 9618288156 నెంబర్లలో సంప్రదించాలన్నారు. బీజేపీ నాయకులు మేకల కమలాకర్, గాజుల సదానందం, సాయి, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి



రాములు (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రం శివారులో శనివారం ఓ రైస్‌మిల్‌కు చెందిన లారీ ఢీకొని అంకుషాపూర్‌కు చెందిన రేగుల రాములు(55) ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన రేగుల రాములు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం తన టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై సిరిసిల్ల వెళ్తుండగా తంగళ్లపల్లి–పద్మనగర్ శివారులో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య లచ్చవ్వ, ఇద్దరు కొడుకులు దాసు, రాజు ఉన్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న తంగళ్లపల్లి ఎస్సై పి.లక్ష్మారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ సిరిసిల్ల పట్టణం రగుడులోని ఒక రైస్‌మిల్‌కు చెందినదని తెలిసింది. రైస్‌మిల్ యజమాని కేసు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు మండలంలో చర్చ సాగుతోంది.

ఘనంగా పుట్టబంగారం పూజలు

- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

చందుర్తి(వేములవాడ): బండపల్లి శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజు శనివారం పుట్ట బంగారం వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు కటకం పద్మ–మల్లేశం, వేదపండితులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం తదితర పూజలు చేసినట్లు ఆలయ ప్రధానార్చకులు కొదంగుల్లా శ్రీకాంతాచార్యులు వివరించారు.

నేడు కల్యాణం

బండపల్లి శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం ఉదయం 11.05 గంటలకు నిర్వహించనున్నారు. కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తుల కోసం చలువ పందిళ్లు, తాగునీటి వసతి, అన్నదానం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ న్యాత విజయ జార్జ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కటకం మల్లేశం, మాజీ అధ్యక్షుడు ఏనుగుల లచ్చిరెడ్డి తెలిపారు.